
సాక్షి అనంతపురం

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.



టన్ను చీనీ రూ. 23,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,500, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/22.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పాత ఈవీఎంల స్కానింగ్ పూర్తి చేయండి

- జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం



ఈవీఎం పెట్టెలను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పాత ఈవీఎంలను హైదరాబాద్, ఘజియాబాద్‌కు తరలించాల్సిన నేపథ్యంలో వాటి స్కానింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణలోని గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను జేసీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. గోదాము వద్ద గట్టి బందోబస్తు ఉండాలన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.14.18 లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. గురువారం ఏడీఏ ఎం.రవి, ఏఓ శశికళ బృందం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసింది. వివిధ కంపెనీలకు చెందిన ఎరువులు, పురుగు మందుల సరఫరా, అమ్మకాలు, నిల్వలు, రైతు బిల్లులు, ధరల పట్టిక, డీబీటీ విధానం, లైసెన్సులు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించారు. అనుమతులు లేకుండా ఎరువులు అమ్ముతున్నట్లు గుర్తించారు. రూ.14,18,500 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ (స్టాప్‌సేల్స్) ఉత్తర్వులు జారీ చేశారు. వాటికి సంబంధించి అనుమతి పత్రాలు, 'ఓ' ఫారం అందజేయకుంటే సీజ్ చేసి 6-ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని దుకాణదారులను హెచ్చరించారు.

టీబీ డ్యాంలో 72 టీఎంసీలు



ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో గురువారం నాటికి 72.076 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు (105.788 టీఎంసీలు) కాగా, 1,623.62 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1,266 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 8,884 క్యూసెక్కులుగా నమోదైంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,380 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1,632.60 అడుగులతో 104.182 టీఎంసీల నీరు నిల్వతో 89,384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 90,938 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

ఇల గోకులం.. మురిసిన భక్తజనం



ఇస్కాన్ మందిరం సమీపంలో ఉట్లోత్సవంలో పాల్గొన్న నగరవాసులు



ప్రత్యేక పూజలందుకున్న రాధాకృష్ణులు



అనంతపురం నగరంలో రాధాకృష్ణుల వేషధారణలతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

జిల్లావ్యాప్తంగా గురువారం కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. చిన్నికృష్ణులు, గోపికలు సందడి చేశారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉట్టికొట్టే కార్యక్రమాలు సందడిగా సాగాయి. అనంతపురం ఇస్కాన్ మందిర పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తాత్కాలిక కొలనులో తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్రజలకు సర్కారు రక్ష!

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఎక్కడా వెనక్కు తగ్గడం లేదు. గ్రామీణవాసులకు పల్లెల్లోనే మెరుగైన వైద్యమందించేందుకు ఇప్పటికే అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసింది. మండలకేంద్రాల్లో అత్యాధునిక హంగులతో ఆస్పత్రులను నిర్మించి వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. 'వైద్యం కోసం రోగులు రావడం కాదు.. రోగుల వద్దకే వెళ్లి వైద్యం అందించేలా' 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశపెట్టింది. పెద్ద ఎత్తున 108 వాహనాలను సమకూర్చింది. సమాచారమిచ్చిన క్షణాల్లో అత్యాధునిక వైద్యం లభించే ఆస్పత్రులకు చేరేలా వసతులు సమకూర్చింది. విప్లవాత్మక చర్యలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన సర్కారు.. ఈ క్రమంలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరున మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది.

	అనంతపురం	శ్రీసత్యసాయి
మండలాలు	31	32
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	434	378
కుటుంబాలు	7,34,691	6,10,586
జనాభా	22,41,105	18,40,043

- జిల్లాలో 16 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- అందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మరో వినూత్న కార్యక్రమం
- ఇంటింటికీ ఏఎన్‌ఎంలు, వలంటీర్లు
- 30 నుంచి ప్రతి మండలంలో మెగా హెల్త్ క్యాంపు
- లక్షలాదిమందికి అందనున్న వైద్యసేవలు!



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' తీసుకొస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 15న కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వలంటీర్లు వెళ్లనున్నారు. ఆరోగ్య సమస్యలను ఆరా తీయనున్నారు. మరుసటి రోజు అంటే 16వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది కూడా వెళ్తారు. ఆయా కుటుంబాల్లోని రోగులను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స అవసరమైతే వెంటనే ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

30న మండలాల్లో మెగా వైద్య శిబిరం..

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరం నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. వీరితో పాటు 104లో ఉండే డాక్టరు అందుబాటులో ఉంటారు. ఒక మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య శిబిరంలో చికిత్సలు అందిస్తారు. హెల్త్ శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్లు మొదలు అన్ని శాఖల అధికారులు పాలుపంచుకోవాల్సి ఉంటుంది.

ఆ రెండు అంశాలే కీలకం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులను గుర్తించడం ఒక అంశమైతే.. వారికి చికిత్స చేయించేందుకు రెఫరల్ కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం రెండో అంశం.

వారిపై ప్రత్యేక దృష్టి..

మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వెళ్లి వలంటీర్, ఏఎన్ఎం సర్వే నిర్వహిస్తారు. 30వ తేదీ నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ క్యాంపు ఉంటుంది. ప్రతి క్యాంపులో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సుజాత, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

ఉచిత శిక్షణతో ఉపాధి

అనంతపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), షిరిడీ సాయి డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎల్డర్లీ కేర్ టేకర్స్ (వృద్ధులను చూసుకోవడం) కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 18–35 మధ్య వయసున్న యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. సర్టిఫికెట్ ఇచ్చి, ప్రభుత్వ ఖర్చుతో కువైట్, దుబాయ్, ఖతార్ లాంటి దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 9963897702 కు కాల్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తపాలా ఉద్యోగాలకు 40 మంది ఎంపిక

అనంతపురం సిటీ: తపాలా శాఖ బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఖాళీ ఉన్న పోస్టులకు 40 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం జాబితా విడుదలైంది. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (బీపీఎం) పోస్టులకు 21 మంది, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (ఏబీపీఎం) పోస్టులకు 18 మందిని ఎంపిక చేశారు. డాక్ సేవక్‌గా మరొకరు ఎంపికయ్యారు. ఈ నెల 16 లోగా అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేయించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

కరోనా బ్యాచ్ వారికే మళ్లీ చాన్స్!

ఉద్యోగాల భర్తీలో కరోనా బ్యాచ్‌కే మళ్లీ అవకాశాలు దక్కాయి. కోవిడ్ ఉధృతి కారణంగా గతంలో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు మూతపడ్డాయి. చేసేది లేక అప్పట్లో పరీక్షలు రద్దు చేసి, విద్యార్థులను మొదటి శ్రేణిలో పాస్ చేసేశారు. ఈ క్రమంలో తపాలా శాఖలో భర్తీ చేసే పోస్టులన్నీ కరోనా బ్యాచ్ వారికే సరిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆదరణ.. ఇక శఠగోపమేనా..?

- ఆదరణ చిట్స్ యాజమాన్యం మొండివైఖరి
- పోలీసుల విచారణకు సహకరించని దంపతులు
- టీడీపీ నేతల అండదండలు!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆదరణ చిట్స్ బాధితులకు ఇప్పట్లో న్యాయం జరిగే సూచనలు కనిపించడం లేదు. కోర్టులో కేసు పూర్తయితే చూద్దాంలే అంటూ బాధితులను 'ఆదరణ చిట్స్' నడుపుతున్న దంపతులు శైలజ, రామకృష్ణలు బుకాయిస్తున్నట్లు తెలిసింది. చిట్స్ వేసిన ఖాతాదారులను పక్కా ప్లాన్‌తోనే మోసం చేసినట్లు దీన్ని బట్టి తెలుస్తోంది. బుధవారం, గురువారం పోలీసుల కస్టడీలోనూ దంపతులు విచారణకు సహకరించలేదని సమాచారం. ఇంకా ఆరు రోజులు వారు పోలీసు కస్టడీలో కొనసాగాల్సి ఉంది. ఇప్పటివరకూ అనంతపురం పట్టణంలోని టూటౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు రూ. 20 కోట్లు బాధితులకు అందాల్సి ఉంది. ఇంకా 430 మందికిపైగా బాధితులు ఉన్నారు. వారి ఫిర్యాదులు కూడా అందితే ఎంత మేరకు మోసం చేశారన్న దానిపై స్పష్టత వస్తుందని పోలీసు వర్గాలు చెబుతుండడగం గమనార్హం.



ఆదరణ చిట్ ఫండ్ కార్యాలయం

సొంత ఆస్తులు కూడబెట్టుకుని..

ఆదరణ చిట్స్ పేరుతో వందల మందిని మోసం చేసిన శైలజ, రామకృష్ణ దంపతులు వసూలు చేసిన కోట్లాది రూపాయలను సొంత ఆస్తులు పోగు చేసుకునేందుకు మళ్లించారు. అనంతపురంతో పాటు హంపాపురం వద్ద 130 ఎకరాలు భూములు కూడబెట్టుకున్నారు. దీంతో పాటు పాలిటెక్నిక్, అగ్రికల్చర్ కళాశాలలు నాలుగు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈనాడు కార్యాలయం సమీపంలోని నాలుగు ప్లాట్‌లకు సంబంధించిన పత్రాలు, విల్లాలు ఉన్నట్లు కస్టడీలో పోలీసుల దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఇంతకు మించి తమ వద్ద ఎలాంటి ఆస్తి లేదని వారు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. బంగారం, డబ్బు లేదని కూడా చెప్పారట. ఇదిలాఉంటే, బెంగళూరులో ఈ దంపతులు పలు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉన్నట్లు తేలింది.

అండగా టీడీపీ నేతలు!

ప్రజల సొమ్ముతో వందల ఎకరాల ఆస్తులు పోగేసుకుని బోర్డు తిప్పేయాలని చూసిన శైలజ, రామకృష్ణ దంపతులకు టీడీపీ నేతల అండదండలున్నట్లు తెలుస్తోంది. వారి ఒత్తిడి మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్‌ను కూడా ఆదరణ చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ చెప్పినట్లుగానే నమోదు చేయాల్సి వచ్చిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీకి చెందిన కీలక నేతల అండదండలు ఉండటంతో ఖాతాదారులకు తిరిగి సొమ్ము చెల్లించే పరిస్థితులు లేవని స్పష్టమవుతోంది. దీంతో చాలా మంది బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు చూస్తున్నారు. ఈ క్రమంలోనే దంపతులను మరోమారు కలసి డబ్బు ఇస్తారో లేదో తెలుసుకోవాలన్న ఆశతో ఉన్నారు. అయితే, వారు మాత్రం కోర్టులో కేసు నడుస్తుండడంతో,ఆ తతంగమంతా పూర్తయ్యే వరకూ తమనేం చేయలేరనే ధీమాతో ఉన్నట్లు తెలిసింది. దీంతోనే విచారణకు కూడా సహకరించడం లేదని సమాచారం.

చంద్రబాబుకు ఓటమి భయం

- అందుకే నోటికొచ్చినట్లు వాగారు
- త్వరలో తాజ్‌మహల్‌నూ తానే కట్టాడంటారేమో?
- బాబును జనం నమ్మరు
- మంత్రి ఉషశ్రీ చరణ్ ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. కళ్యాణదుర్గంలో నిర్వహించిన సభకు ప్రజలు రాకపోవడంతో అసహనానికి గురై నోటికొచ్చినట్టు వాగారని విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుకు ఇప్పుడు కళ్యాణదుర్గం గుర్తుకు రావడం విడ్డూరమన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. తమ హయాంలోనే బీటీపీ పనులు 25 శాతం పూర్తి చేశామంటూ సిగ్గులేకుండా చెప్పారన్నారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. బీటీపీ గురించి చెప్పిన వెంటనే సీఎం జగన్ పరిహారం విడుదలకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ మోసం చేసేందుకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, తమ హయాంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తానంటున్న చంద్రబాబు.. గతంలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. 'సెల్‌ఫోన్ కనిపెట్టింది నేనే' అంటూ గతంలో అభాసుపాలయ్యారని, ఈ క్రమంలోనే త్వరలో తానే తాజ్‌మహల్ కట్టానని అన్నా అంటాడంటూ ఎద్దేవా చేశారు. బీసీలు, ఎస్సీలు ఎదగడం బాబుకు ఇష్టం లేదని, అందుకే కళ్యాణదుర్గం సభలో తన పక్కన ఒక్కరు కూడా ఆయా వర్గాలకు చెందిన వ్యక్తులను నిలబెట్టుకోలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పడం చాలా విచిత్రంగా ఉందన్నారు. జనం నవ్వుకుంటున్నా మారడం లేదని, ఆయన జీవితమంతా కాపీలు కొట్టడానికే సరిపోతోందంటూ ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంపీపీ మారుతమ్మ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, జెడ్పీటీసీ బొమ్మన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి తదితరులున్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

రాప్తాడురూరల్: పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు ఆదేశించారు. గురువారం బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద-మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు రుచికరమైన, పౌష్టికరమైన ఆహారం ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శించకూడదని ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'జగనన్న గోరుముద్ద'ను తీసుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు షూ లేకుండా ఉండడాన్ని డీఈఓ గమనించారు. ప్రతి విద్యార్థీ యూనిఫాంతో పాటు షూ, టై, బెల్ట్ ధరించేలా హెచ్ఎం, ఉపాధ్యాయులు చూడాలని ఆదేశించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. సబ్జెక్టు టీచర్లు వారివారి సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులతో వర్క్‌బుక్‌లు రాయించాలని సూచించారు. లెసన్ ప్లాన్‌తోనే పాఠశాలకు రావాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తే కచ్చితంగా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు పక్కాగా ఉండాలి

గుంతకల్లు రూరల్: ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఆమె మండల పరిధిలోని నాగసముద్రం సమీపంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నాటికి ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. ఎరువులను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి, టెక్నికల్ ఏఓ శ్రీశంకర్ లాల్‌నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి, ఖాదర్‌పేట గ్రామాల పరిధిలోని ఆర్‌బీకేల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-పంట నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ డీ లీనా వసుంధర, డీఆర్‌సీ వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓ శ్రీనివాసరావు, వీఏఏ ఆదినారాయణ, ఎంపీఈఓ అర్చన, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్పీ



మల్లేశ్వరుని సన్నిధిలో ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. సచివాలయల మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలికరప్ప, ఆలయ ధర్మకర్త మల్లూరి వెంకటేశు తదితరులు ఆలయ మర్యాదలతో వారిని స్వాగతించారు. విశేష పూజల అనంతరం స్వామి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాజేష్ ఉన్నారు.

ఉచితంగా మైక్రోసాఫ్ట్ కోర్సులు

- డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా జగన్ సర్కార్ చర్యలు
- నాస్కామ్ ఫ్యూచర్స్ స్కిల్స్ పేరిట ప్రత్యేక శిక్షణ
- దరఖాస్తు చేసుకున్న జేఎన్‌టీయూ(ఏ)లో 25 వేల మంది, ఎస్కేయూలో 15 వేల మంది



అనంతపురం: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిగ్రీలో ఆనర్స్ విధానాన్ని ప్రవేశపెట్టి బీటెక్‌కు దీటుగా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచింది. ఈ క్రమంలోనే డిగ్రీ ఆనర్స్, బీటెక్ చదివే విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు మరో అడుగు ముందుకేసింది. వేలాది రూపాయలు వెచ్చించినా అందని శిక్షణను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందు కోసం ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా చోటు దక్కించుకున్న మైక్రోసాఫ్ట్ కంపెనీతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కంపెనీకి సంబంధించిన అధునాతన కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణలో జిల్లాకు చెందిన 40 వేల మంది..

నిర్మాణాత్మక, వృత్తి సంబంధిత కోర్సుల్లో డిగ్రీ, బీటెక్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఇంటర్న్‌షిప్, అప్రెంటైజ్‌షిప్ కు అవకాశం కల్పిస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను అభివృద్ధి చేసే క్రమంలో ఈ శిక్షణ ఉంటోంది. ఇందులో భాగంగా ఇంటర్న్‌షిప్‌ను కొనసాగించేందుకు వీలుగా ఆయా పరిశ్రమలతో కళాశాలలను అనుసంధానం చేశారు. ఇందు కోసం ఏకంగా ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 1.62 లక్షల మందికి డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనాలసిస్, నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సర్టిఫికేషన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోనే 40 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 25 వేల మంది, ఎస్కేయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో 15 వేల మంది విద్యార్థులు ఉండడం గమనార్హం.

వర్చువల్ విధానంలో శిక్షణ..

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) ఫ్యూచర్ స్కిల్స్ పేరిట మైక్రోసాఫ్ట్ టెక్నాలజీస్, సిస్కో, సేల్స్‌ఫోర్స్, ఏడబ్ల్యూఎస్ విభాగాల్లో వర్చువల్ విధానం కింద ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తోంది. ఐసీఐసీఐ, విప్రో, ఐబీఎం, ఎడెల్‌వీస్, హోండా, మారుతి సుజికీ వంటి కంపెనీల్లో ఫుల్‌స్టేక్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, బీఎఫ్‌ఎస్‌ఐ వంటి తదితర అంశాల్లో 'ఎంప్లాయిమెంట్ ఎక్స్‌ప్రెస్' సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ సంస్థతో వర్చువల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి వీలుగా ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుంది.

చాలా విలువైన కోర్సు



మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ కోర్సులు చాలా విలువైనవి. వేలాది రూపాయలు వెచ్చించినా ఇలాంటి అడ్వాన్స్‌డ్ కోర్సులు అందుబాటులోకి రావు. ఇలాంటి అమూల్యమైన కోర్సులు ఉచితంగా విద్యార్థులకు అందజేయడం గొప్ప అంశం. జేఎన్‌టీయూ (ఏ)లో ఈ కోర్సులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇప్పటికే 25 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి ఇలాంటి కోర్సులు అందిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డికి అభినందనలు.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

ఇంటర్న్‌షిప్ తప్పనిసరి



డిగ్రీ కోర్సుల్లో ఆనర్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నాలుగేళ్ల కాల వ్యవధితో కూడిన డిగ్రీ కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఇంటర్న్‌షిప్ చేస్తే పరిశ్రమల అనుభవం గడించవచ్చు. ఈ క్రమంలో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. ఈ మేరకు కార్యాచరణ పూర్తి చేశాం. ఏఏ కంపెనీలకు విద్యార్థులకు వెళ్లాలి అనే అంశంపై కసరత్తు పూర్తయింది. కోర్సుల్లో అభ్యసనాభవమే కాకుండా... పరిశ్రమల అనుభవం కూడా వచ్చే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవితకు దోహదపడుతాయి.

–ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, వీసీ, ఎస్కేయూ

టీ సర్కిల్‌లో కూలిన చంద్రబాబు కటౌట్



టీ సర్కిల్‌లో కూలిన చంద్రబాబు కటౌట్

కళ్యాణదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ కటౌట్ కుప్పకూలింది. 'బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో బుధవారం కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో చంద్రబాబు సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన చంద్రబాబు కటౌట్‌ను తొలగించడంలో టీడీపీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవరించారు. గురువారం ఉదయం పట్టణ సమీపంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో వీచిన గాలులకు కటౌట్ విద్యుత్ తీగలపై పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కరెంట్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే ప్రాణాపాయం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

లారీని ఢీకొని ఐచర్ డ్రైవర్ మృతి



మృతుడు అబ్దుల్ ఖాదర్

గుత్తి రూరల్: రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొన్న ఘటనలో ఐచర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు నగరానికి చెందిన ఐచర్ డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ (58).. ఎస్‌ఎల్‌ఆర్టీ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో ఐచర్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి అనంతపురం నుంచి కర్నూలు వైపుగా ఐచర్‌లో వెళ్తుండగా పోతుదొడ్డి శివారులో 44వ జాతీయ రహదారి పక్కనే ఆపిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఐచర్ క్యాబిన్ నుజ్జునుజ్జై డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న నంద్యాల జిల్లా ప్యాపిలి పోలీసులు అక్కడకు చేరుకుని అతి కష్టంపై క్షతగాత్రుడిని వెలికి తీసి హైవే అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించ లోపు పరిస్థితి విషమించి అబ్దుల్ ఖాదర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నగరంలో గ్యాంగ్ వార్

- బీరుబాటిళ్లతో పరస్పర దాడి
- కారు, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- బీరు బాటిల్ ముక్కతో పొడవడంతో ఒకరి పరిస్థితి విషమం
- అందరినీ అరెస్ట్ చేశామన్న పోలీసులు



గాయపడిన వారికి చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో అల్లరి మూక పేట్రేగి పోయింది. ఆధిపత్య పోరులో గ్యాంగ్ వార్‌కు తెరలేపారు కొందరు యువకులు. బీరు బాటిళ్లతో దాడులకు తెగబడ్డారు. బాటిల్‌తో తలపై దాడి చేసి పగిలిన గాజు ముక్కతో పొడవడంతో ఓ యువకుడి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు...

పాత గొడవల నేపథ్యంలో

అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన సాకే నరేష్ సోదరుడు వినీష్‌కు, చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన కార్తీక్‌కు మధ్య పాతగొడవలున్నాయి. ఇటీవల మొహర్రం వేడుకల్లోనూ వీరిద్దరూ తమ అనుయాయులతో కలసి పరస్పర దాడులు చేసుకున్నారు. అనంతరం జరిగిన విషయాన్ని తన అన్న సాకే నరేష్‌కు వినీష్ తెలిపి ఎలాగైనా కార్తీక్‌ను కొట్టాలని కోరాడు. తమ్ముడి అభ్యర్థనను మన్నిస్తూ నరేష్ పలుమార్లు కార్తీక్‌కు ఫోన్ చేసి రెచ్చగొట్టేలా మాట్లాడుతూ వచ్చాడు.

ఆజ్యం పోసిన టీడీపీ నేత కుమారుడు

రెండు రోజుల క్రితం కార్తీక్ పుట్టిన రోజును పురస్కరించుకుని మిత్రులకు ఘనంగా విందు ఏర్పాటు చేశాడు. ఈ వేడుకకు ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నేత కుమారుడు సురేష్ అలియాస్ సూరిని ఆహ్వానించి, నరేష్ విషయాన్ని లెవనెత్తాడు. రెండు రోజులుగా నరేష్ తనకు ఫోన్ చేసి దుర్భాషలాడుతూ రెచ్చగొడుతున్నాడని వివరించాడు. వివాదాన్ని చర్చలతో సద్దుమణిగించకుండా సురేష్.. దానికి మరింత ఆజ్యం పోశాడు. తాడోపేడో తేల్చుకుందామంటూ విందులో అందరినీ సమాయత్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న నరేష్ బుధవారం ఉదయం కార్తీక్‌కు ఫోన్ చేసి 'రేయ్ ఎంత మందిని తెచ్చుకుంటావో తెచ్చుకో. ఎక్కడికి రమ్మంటే అక్కడికే వస్తాం' అంటూ సవాల్ విసిరాడు. 'మీరొచ్చేది ఏంది.. మేమే వస్తాం' అంటూ నరేష్ చెప్పిన ప్రాంతానికి బుధవారం రాత్రి 8 గంటలకు ఓ కారు, మూడు ద్విచక్ర వాహనాల్లో కార్తీక్, సురేష్ బృందం చేరుకుంది.

అరగంటకు పైగా విధ్వంసం

నవోదయ కాలనీకి చేరుకున్న ఇరు వర్గాలు అరగంటకు పైగా ప్రధాన కూడలిలో దాడి, ప్రతిదాడులతో చెలరేగిపోయారు. కారుతో పాటు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న బీరు బాటిళ్లతో నరేష్ వర్గీయులపై సురేష్, కార్తీక్ వర్గీయులు విరుచుకుపడ్డారు. నరేష్ తలపై బీరుబాటిల్‌తో మోదడంతో తలపగిలింది. వెనువెంటనే పగిలిన బీరుబాటిల్ ముక్కతో వీపుపై పొడిచారు. సాకే నరేష్ కుప్పకూలగానే ఎవరికి వారు అక్కడి నుంచి తప్పించుకున్నారు. మొత్తంగా ఓ వైపు 15 మంది మరో వైపు ఏడుగురు విధ్వంసం సృష్టించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకునేలోపు అక్కడ యుద్ధ వాతావరణం తప్ప ఎవరూ కనిపించలేదు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న నరేష్‌తో పాటు మరికొందరు క్షతగాత్రులను సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నరేష్‌కు వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి రెఫర్ చేయడంతో కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు.

పోలీసుల అదుపులో అల్లరిమూక

విషయం తెలుసుకున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు సీరియస్ కావడంతో అల్లరిమూక కోసం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప నేతృత్వంలో పోలీసులు జల్లెడ పట్టారు. నరేష్‌పై దాడి చేసిన అనంతరం కార్తీక్ బృందం నగర శివారులోని చంద్రబాబునాయుడు కొట్టాల సమీపంలో మద్యం తాగుతూ కనిపించడంతో అందరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా, దాడికి సంబంధించిన ఆధారాల కోసం సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైన అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

గ్యాంగ్ వార్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు

కార్తీక్ వర్గీయుల్లో పలువురు బీటెక్ విద్యార్థులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నగరంలోని ఆలుమూరు రోడ్డులో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు కార్తీక్‌తో సఖ్యతగా ఉంటూ గ్యాంగ్ వార్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. బుధవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని కళాశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఫొటో షూట్ ముగించుకుని తిరిగి కళాశాలకు వెళుతున్న సమయంలో కార్తీక్ బృందంలోని ఓ మిత్రుడు పలకరించి వెంట పిలుచుకెళ్లాడు. తీరా గొడవ జరగడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు బ్యాంక్ ఉద్యోగి కుమారుడు, మరొకరు ఆర్టీసీ ఉద్యోగి కుమారుడు, ఇంకొకరు రైతు బిడ్డ ఉన్నట్లు సమాచారం. అల్లరి మూకతో చేసిన స్నేహం చివరకు వారిని నేరాల బాట పట్టించిందంటూ పలువురు వ్యాఖ్యానించారు.

అస్వస్థతకు గురై యువ రైతు మృతి



రంగస్వామి మృతదేహం

గుంతకల్లు రూరల్: పొలంలో పంటకు క్రిమి సంహారక మందు కొడుతూ అస్వస్థతకు గురై ఓ యువరైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం గుర్రబ్బాడు గ్రామానికి చెందిన మల్లేష్, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రంగస్వామి (17) పదో తరగతి వరకూ చదువుకుని వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తల్లిదండ్రులతో కలసి పొలానికి క్రిమి సంహారక మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మందు పిచికారీ చేస్తుండగా విష ప్రభావంతో అస్వస్థతకు గురైన కుమారుడిని తల్లిదండ్రులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రంగస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ పేర్కొన్నారు.

చంద్రబాబు సంస్కార హీనుడు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంస్కార హీనుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది తప్పుడు పుట్టుక అని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. గతంలో తన భార్య నారా భువనేశ్వరిపై వ్యాఖ్యలు చేశారని గగ్గోలు పెట్టిన విషయం మర్చిపోయినట్టున్నారన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ రోజూ పనిగట్టుకుని సీఎం వైఎస్ జగన్‌పై దుర్భాషలాడడం గర్హనీయమన్నారు. రూ.118 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిందని, ఈ క్రమంలో ముందుగానే తనను అరెస్టు చేస్తారని భావించి శాంతిభద్రతలను విఘాతం కల్గించేందుకు బాబు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. చంద్రబాబు గోరంత అవినీతి మాత్రమే ప్రస్తుతానికి బయటపడిందని, రానున్న రోజుల్లో కొండంత అవినీతి బయటపడుతుందని స్పష్టం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ న్యాయబద్ధంగా భూములు కొనుగోలు చేస్తే, దానిపై కూడా తప్పుడు మాటలు మాట్లాడడం హేయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మంత్రి ఉషశ్రీచరణ్ నిస్వార్థంగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. తమ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ తట్టుకోలేక నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, రానున్న రోజుల్లో టీడీపీను ప్రజలే భూస్థాపితం చేస్తారని స్పష్టం చేశారు.

ఆరుగురు రైల్వే ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని వైఎస్సార్ కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఎర్రముక్కపల్లి రైల్వేగేట్ సమీపంలో గూడ్స్‌రైలు మంగళవారం రాత్రి పట్టాలు తప్పిన ఘటనలో ఆరుగురు ఉద్యోగులను సస్పెన్షన్ చేస్తూ సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఆర్‌ఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో కడప స్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డి, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, స్టేషన్ సూపరింటెండెంట్ లాల్‌బాబుసింగ్, సీనియర్ జీటీఎం ఖాసీమ్, పాయింట్స్‌మెన్లు శాంతి, ప్రతాప్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిపారు. దీంతోపాటు వీరు కడప నుంచి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

మరణించినా.. ఆయన చూపు సజీవం



ఓబుళరెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: మరణించినా.. ఆయన కళ్లు సజీవంగానే ఉన్నాయి. నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు ప్రసాదించాయి. రెండు రోజుల క్రితం ఆత్మకూరుకు చెందిన ఓబుళరెడ్డి (35) వడ్డుపల్లి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. తన సోదరుడు సజీవంగా లేకపోయినా... ఆయన చూపు బతికే ఉండాలన్న ఆకాంక్షతో ఓబుళరెడ్డి నేత్రాలను దానం చేసేందుకు అన్న మనోహర్‌రెడ్డి సమ్మతించాడు. దీంతో గురువారం ఉదయం ఓబుళరెడ్డి మృతదేహం నుంచి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణులు సేకరించారు. ఓబుళరెడ్డి నేత్రాలను చూపులేని మరో ఇద్దరికి ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా వైద్య నిపుణులు పేర్కొన్నారు.

వైఎస్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి బాబుకు లేదు

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



అనంతపురం క్రైం/ఉరవకొండ: వైఎస్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి చంద్రబాబుకు లేదని ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వైఎస్సార్ కుటుంబం గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉన్నతశ్రేణి గృహిణిగా ఖ్యాతిగాంచిన వైఎస్ విజయమ్మను తులనాడుతూ 75 ఏళ్ల వయసున్న చంద్రబాబు మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. బేషరుతుగా వైఎస్ విజయమ్మకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్, వైఎస్ విజయమ్మ దంపతులు ఎన్నో త్యాగాలు చేసి దేశ రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి వద్ద చంద్రబాబు సెల్ఫీ తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు చంద్రబాబు తగ్గిస్తే.. దానిని 40 టీఎంసీలకు పునరుద్ధరించి రాయలసీమను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు డాక్టర్ వైఎస్సార్ అన్నారు. హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కులేని చంద్రబాబుకు లేదన్నారు. ఐటీ నోటీసుల విషయంలో చంద్రబాబు గిలగిలా కొట్టుకుంటున్నాడన్నారు. రూ.118 కోట్ల అక్రమాలకు సంబంధించి మరో రెండు, మూడ్రోజుల్లో చంద్రబాబు అరెస్టు అయ్యే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రాక

ఆత్మకూరు: మండల కేంద్రానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల గదుల ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు తప్పక హాజరుకావాలన్నారు.

రాముకు డాక్టరేట్ ప్రదానం


బి.రాము

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన బొలెశెట్టి రాముకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు పర్యవేక్షణలో ' సింథసిస్, క్యారక్టరైజేషన్ అండ్ బయాలజికల్ ఎవాల్యుయేషన్స్ ఆఫ్ న్యూ షిఫ్ బేస్- మెటల్ కాంప్లెక్సెస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన సందర్భంగా తోటి పరిశోధన విద్యార్థులు అభినందించారు.

అన్నపూర్ణకు..


ఎన్. అన్నపూర్ణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని స్టాటిస్టిక్స్ విభాగంలో పరిశోధన చేసిన నరసింహప్ప గారి అన్నపూర్ణకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ మహమ్మద్ అక్తర్ పర్యవేక్షణలో ' ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రొబాబులిటీ ఆఫ్ యాక్సెప్టెన్స్ బేస్డ్ ఆన్ ఫ్రెచ్ట్ అండ్ జనరలైజ్డ్ రియాలిగ్ డిస్ట్రిబ్యూషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలం, ఆలదపల్లికి చెందిన అన్నపూర్ణ రాసిన వ్యాసాలు పలు జాతీయ, అంతర్జాతీయంగా ప్రచురితమయ్యాయి.

అవగాహనతో కుష్టు నివారణ


మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ విభాగం అధికారి నాగన్న

రాప్తాడు: అవగాహనతోనే కుష్టు నివారించొచ్చని అనంతపురం జిల్లా లెప్రసీ విభాగం అధికారి నాగన్న తెలిపారు. గురువారం మండలంలోని పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కుష్టు వ్యాధి లక్షణాలను తెలుసుకొని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురదపెట్టే మచ్చల వల్ల అపోహలు పడరాదని సూచించారు. కుష్టు వ్యాధి ప్రారంభ దశలోనే వైద్యాధికారులను సంప్రదించి, చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాదన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ నారాయణ స్వామి, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలోని కూడలిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి, కింద భాగంలో పూర్తిగా దెబ్బతింది. స్తంభానికి ఇరువైపులా పూర్తిగా చీలికలు వచ్చాయి. భారీ వర్షాలు, ఈదురుగాలులకు స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


పింఛన్లు పంపిణీ చేస్తున్న తోపుదుర్తి చందు


కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పని చేస్తూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సూడో నక్సలిజాన్ని ప్రోత్సహించిన ఎల్లో మీడియా:

గతంలో ఉన్న తరిమల నాగిరెడ్డి వంటి అసలైన విప్లవకారులను పక్కన పెట్టిన ఎల్లో మీడియా సూడో నక్సలిజాన్ని నడిపిన పరిటాలరవి లాంటి వారిని ప్రోత్రహించారని తోపుదుర్తి చందు విమర్శించారు. దీన్ని అసరా చేసుకొని రాజకీయాల్లో వచ్చిన పరిటాల కుటుంబం పేదలకు చేసిందేమీలేదన్నారు. 25 ఏళ్ల పాటు రాజకీయ పదవులు అనుభవిస్తూ రూ.కోట్లకు పడగలెత్తారన్నారు. అయితే ఇప్పుడు తమపైన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు గుర్తించి పేదల పక్షాన పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

భక్తజన సంద్రం..ఇస్కాన్ మందిరం

- వైభవంగా సాగిన కృష్ణాష్టమి వేడుకలు
- కనులపండువగా తెప్పోత్సవం



వెంకట్రావ్‌నగర్‌లోని పాండురంగస్వామి ఆలయంలో కొలువుదీరిన కృష్ణుడు ,విద్యుత్ దీపాలంకరణలో ఆలయం


ఉట్టి తీసుకొస్తున్న ఆలయ కమిటీ గౌరంగదాస్

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఇస్కాన్ మందిరాన్ని భక్తజన సంద్రంగా మార్చేశాయి. గురువారం తెల్లవారుజామున నుంచే భక్తుల రాకతో మందిరం కిటకిటాడింది. జనం బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం హరినామ సంకీర్తనతో ఇస్కాన్ పరిసరాలు మార్మోగాయి. తులసీ అర్చనలు, అలంకార సేవలు, జరిగాయి. సాయంత్రం శ్రీకృష్ణ గోపికా వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు. ఉట్టి ఉత్సవంలో పోటీపడుతూ ఉట్టిని సాధించారు. అనంతరం ఇస్కాన్ మందిరం వెలుపల ఏర్పాటు చేసిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. రాత్రి ఊంజల సేవ, దీపోత్సవం, మహాపుష్పాభిషేకం జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఇస్కాన్‌లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను ఆమె ప్రారంభించారు.

రాధాపార్థసారథులను దర్శించుకున్న చంద్రబాబు : జిల్లా పర్యటనకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గమధ్యలో ఇస్కాన్ మందిరాన్ని, రాధాపార్థసారథులను దర్శించుకున్నారు. ఆయనకు రాధాకృష్ణుల చిత్రపటాన్ని అందించారు.

నేత్రపర్వంగా బ్రహ్మరథోత్సవం : నగరంలోని మూడవ రోడ్డు ఉడుపి శ్రీకృష్ణ మఠంలో ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు జరిగాయి. ప్రత్యేక పుష్పాలంకారంతో దర్శనమిచ్చిన శ్రీకృష్ణుడిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. మధ్యాహ్నం అభిషేకాలు, అన్నప్రసాదాల నైవేద్యం పంపిణీ జరిగింది. సాయంత్రం సర్వాంగ సుందరంగా అలంకరించిన బ్రహ్మరథోత్సవం నగరవీధుల్లో ఘనంగా సాగింది. ఆలయ ప్రతినిధి లక్ష్మణాచార్యుల నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం తదితర చోట్ల కృష్ణాష్టమి వేడుకలు సంబరంగా జరిగాయి.

సందడిగా ఉట్ల ఉత్సవం : నగరంలోని రామనగర్‌లో వెలిసిన రుక్మిణి పాండురంగ విఠల దేవస్థానంలో భావసార క్షత్రియ మహిళా మండలి 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి కలిసి రావడంతో ఆలయం సందడిగా మారింది. సాయంత్రం గోవింద నామావళి సామూహికంగా పఠించిన అనంతరం మరాఠీ సంప్రదాయాలు ఉట్టిపడేలా దైహండి పేరుతో ఉట్టి ఉత్సవం జరిగింది. అనంతరం మహా ప్రసాద వితరణ చేశారు.

'ఉట్టి'పడిన భక్తి భావం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ప్రధాన ద్వారం ఎదురుగా శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు ప్రారంభించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, బీసీ నాయకులు రమేష్ గౌడ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణాష్టమి కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ జయపాల్ యాదవ్, సురేష్, రవి, అమర్ యాదవ్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎస్కేయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ మునినారాయణప్ప, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్ కుమార్, డి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: నగరంలోని శిల్పారంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాధకృష్ణా వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నాయి. శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్, నగర ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు, ముట్టాల గ్రామాల్లో గురువారం భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. తలుపూరులో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.


శివాలయంలో శ్రీకృష్ణుడు, ఉడిపి కృష్ణుడు


తెప్పోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


వివిధ వేషధారణలో చిన్నారులు


కాశీవిశ్వేశ్వరాలయంలో కృష్ణావతారంలో సీతారాములు


శ్రీకృష్ణుడి పాటలకు నృత్యాలు చేస్తున్న దృశ్యం


ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడి విగ్రహం


కార్యక్రమంలో పాల్గొన్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి


ఆత్మకూరులో ఉత్సాహంగా ఉట్టికొడుతున్న యువకులు


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

కుదేలైన టమాట రైతు


వద్దుపల్లి వద్ద రోడ్డు పక్కన పడేసిన టమాటాలు

ఆత్మకూరు: ధర తగ్గిపోవడంతో టమాట రైతులు కుదేలయ్యారు. సరిగ్గా నెల రోజుల క్రితం 15 కిలోల టమాట బాక్సు ధర మార్కెట్‌లో రూ. వెయ్యికి పైగా పలికింది. రోజు రోజుకూ వందలాదిరూపాయలు ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో 15 కిలో టమాట బాక్సు ధర రూ. 70 కి మించి పలకలేదు. ఇక టమాట కొద్దిగా నాసిరకంగా ఉంటే నో సేల్ వేస్తున్నారు. గురువారం అనంతపురం నుంచి వంపనూరు వరకు రోడ్డు పక్కన టమాటాలు పారబోశారు. నెల రోజులకే ఇలా టమాటాలు ధరలు లేక రోడ్డున పడేసే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు టమాట పంట ఎక్కువగా సాగు చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: ప్రతి ఒక్కరూ పోషక విలువ లున్న ఆహారం తీసుకోవాలని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ పేర్కొన్నారు. గురువారం జాతీయ పోషకాహార వారోత్సవాల భాగంగా పీవీకేకే కళాశాలలో పోషకాహారంతో కలిగే ప్రయోజనాలపై కరపత్రాలు విడుదల చేశారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి


వద్దపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్దన్

ఆత్మకూరు: వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ జనార్దన్ సూచించారు. గురువారం మండలంలోని వద్దుపల్లి గ్రామం వద్ద ప్రజలు, వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ప్రతి ఒక్కరూ లైసెన్స్, వాహనరికార్డులు ఉంచుకోవాలన్నారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నలుగురు సభ్యులుగా ఉన్న దొంగల ముఠాను బుధవారం సాయంత్రం మరూరు టోల్‌ప్లాజా వద్ద అనంత పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో తాళం వేసిన ఇళ్లను కొల్లగొట్టే నలుగురు యువకులు... వరంగల్లు ప్రాంతం నుంచి కర్నూలు మీదుగా అనంతపురం వైపుగా వచ్చారు. ఈ క్రమంలో వరంగల్ పోలీసుల నుంచి సమాచారం అందుకున్న కర్నూలు పోలీసులు వెంటనే అప్రమత్తమై వాహన తనిఖీలు చేపట్టారు. అయితే అక్కడి నుంచి తప్పించుకున్న ముఠా సభ్యులు నేరుగా అనంతపురం జిల్లాకు చేరుకుని 44వ జాతీయ రహదారి మీదుగా రాప్తాడు మండలం మరూరు టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కాపుకాసిన రాప్తాడు పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ విషయాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డిని ఆరా తీయగా నిర్ధారించలేదు. కర్నూలు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందన్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం గ్రామానికి చెందిన చెన్నమ్మ (65) బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. క్యాన్సర్ కారణంగా నొప్పి తీవ్రత భరించలేని ఆమె జీవితంపై విరక్తితో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్ధన తెలిపారు.

12 నుంచి స్కూల్ గేమ్స్

గార్లదిన్నె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఈనెల 12,13 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రనాయక్ పేర్కొన్నారు. 2023-24 స్కూల్ గేమ్స్ నిర్వహణపై పీడీ, పీఈటీలతో గురువారం ఎంఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాలురు, బాలికలకు స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అండర్-14 విభాగంలో పాల్గొనే విద్యార్థులు 2010 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్ -17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. వివరాలకు మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి సెల్ నంబర్ 8523014164లో సంప్రదించాలన్నారు. పీడీలు శ్రీనివాసరెడ్డి, లింగమయ్య, వెంకటేశ్వర్లు, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


సురేష్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శిస్తున్న తోపుదుర్తి చందు , నాయకులు

ఆత్మకూరు: మండలంలోని వద్దుపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో ఆత్మకూరుకు చెందిన సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి బుధవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయనుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ కుళ్లాయప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు వేణుగోపాల్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, రాజంహంస టవర్స్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుత్తి రోడ్డు, వినాయక్‌నగర్, భాగ్యనగర్, ఎన్టీఆర్ మార్గ్, జనచైతన్య నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కోసం మారథాన్

అనంతపురం క్రైం: నగరంలోని ఐదు కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయవర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా 17 నుంచి 25 ఏళ్ల వయసు ఉన్న యువత రణలో పాల్గొనొచ్చు.

నేటి నుంచి భగవద్గీత సాధన శిబిరం

అనంతపురం కల్చరల్: నగరంలోని రెవెన్యూకాలనీ శ్రీ రామాలయంలో భగవద్గీత సాధన శిబిరం వారం రోజుల పాటు జరుగనుంది. ఈ మేరకు గురువారం ఆలయంలో జరిగిన సమావేశంలో వివేకానంద యోగ కేంద్ర ప్రతినిధులు బీఎస్ఎన్ఎల్ రాజశేఖరరెడ్డి, దివాకర్ మాట్లాడారు. ఈనెల 8 నుంచి 14 వరకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, అర్థం తాత్పర్యాలను వివరిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 94402 88899లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రైలు కింద పడి వృద్ధుడి దుర్మరణం

అనంతపురం సిటీ: అనంతపురం రాంనగర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు మరణించినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ గురువారం తెలిపారు. మృతుడికి 70 ఏళ్ల వయసు ఉంటుందని, లేత చిలక పచ్చ రంగు షర్ట్, కాఫీ, నీలం రంగు గల గల్ల లుంగీ ధరించి, కుడి చేతిపై తేలు బొమ్మ పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. కాగా అనంతపురం పెద్దాస్పత్రిలో చికిత్స కోసం వచ్చి, ఇలా రైలు కిందపడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సెల్: 99088 37888/85005 38200లో సమాచారం తెలపాలని ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం సిటీ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని అనంతపురంలోని ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తేజోవతీకు ఎస్టీయూ ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. డీడీని కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపొందించేందుకు నడుం బిగించాలని నగర్ మేయర్ వసీం అన్నారు. గురువారం వేణుగోపాల్‌నగర్ సెంట్రల్ పార్కులో నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్రస్తుతం ఎటు చూసినా కాలుష్యం నిండిపోయిందని, ప్రజలు కాలుష్య గాలి పీల్చి అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చినప్పుడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో అరికట్టాలి:

నగరంలో రోజు రోజుకూ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోందని డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వారంలో రెండు మూడు రోజులు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, వ్యాపారులు, దుకాణాలపై విస్తృత తనిఖీలు చేయాలన్నారు. అనంత నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ ఆక్సిజన్ అందించే పచ్చని వృక్షాలను పరిరక్షించేందుకు నగర ప్రజలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు పీవీ కిశోర్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, కార్పొరేటర్లు అంకే కుమారమ్మ, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, జయలలిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూస్ట్ అడిగాడు...చైన్ కొట్టేశాడు

రాప్తాడురూరల్: దుకాణం వద్దకు వచ్చి బూస్ట్, బ్రష్ కొనుగోలు చేసి, రూ.100 నోటు ఇచ్చాడు.. చిల్లర కోసమని అంగడి నిర్వాహకురాలు వెనక్కు తిరగ్గానే ఎంచక్కా ఆమె మెడలో బంగారు చైను లాక్కెళ్లాడు ఓ దుండగుడు. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..నందమూరినగర్‌కు చెందిన ఆంజనేయులు, వరలక్ష్మి దంపతులు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం సాయంత్రం వరలక్ష్మి దుకాణంలో ఉండగా ఎవరూలేని విషయం గమనించి, ఓ గుర్తు తెలియని వ్యక్తి పల్సర్ బైకులో వచ్చి అంగడి ముందు నిలిపాడు. దుకాణం వద్దకు వెళ్లి ' అక్కా...బూస్ట్ ప్యాకెట్, బ్రష్ కావాలి' అని అడిగాడు. ఆమె అవి ఇవ్వగానే రూ.100 నోటు ఇచ్చాడు. చిల్లర ఇచ్చేందుకు ఆమె ప్రయత్నిస్తుండగా మెడలో మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ హఠాత్పరిణామం నుంచి బాధితురాలు తేరుకొని గట్టిగా కేకలు వేసింది. అప్పటికే దుండగుడు బైక్‌పై ఉడాయించాడు. బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.